క్లుప్తంగా

జీవితాల్లో వెలుగులు నింపాలి



శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : ఈ క్రిస్మస్ పర్వదినం క్రైస్తవుల జీవితాల్లో వెలుగులు నింపాలని ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ ఆకాంక్షించారు. నియోజకవర్గ వ్యాప్తంగా బుధవారం క్రిస్మస్ పండుగను జరుపుకుంటున్న క్రైస్తవులకు వారు శుభాకాంక్షలు తెలిపారు. సాటి మనుషులపై ప్రేమ, కరుణ, క్షమ, త్యాగం, శాంతిని తన జీవితం ద్వారా మానవాళికి క్రీస్తు ఇచ్చిన మహోన్నత సందేశాలని, వాటిని ఆచరించి శాంతియుత జీవన మార్గాన్ని అలవరుచుకుని క్రైస్తవులందరూ ఆనందంగా పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ఉచిత శిక్షణ

ప్రొద్దుటూరు కల్చరల్ : రాష్ట్ర ప్రభుత్వం ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ నాన్ వాయిస్ అనే కోర్సులో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా నైపుణ్య అధికారి విజయ వినీల్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 2వ తేదీ నుంచి నూతన ఆంకేతికతను ఉపయోగించి ఇండస్ట్రీ నిపుణుల ద్వారా శిక్షణ ఇచ్చి, అనంతరం ఉపాధి అవకాశాలను కల్పించడం ప్రోగ్రాం ముఖ్య ఉద్దేశమని వారు పేర్కొన్నారు. డిగ్రీ పాస్ అయిన నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 8886297300, 9666172953 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

విరాళం



ఆలయ ప్రాంగణంలో దాతలు

బ్రహ్మంగారిమఠం : శ్రీ ఈశ్వరి మహాదేవి ఆలయానికి రేకలకుంట డి.అగ్రహారం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కానాల మల్లికార్జున రెడ్డి, మాధవి దంపతులు రూ.10 లక్షలు అందజేశారు. ఆలయ అభివృద్ధికి ఈ నిధులు వినియోగించాలని వారు నిర్వాహకులను కోరారు.

ఉద్యోగులకు మధ్యంతర భృతి ఇవ్వాలి

పోరుమామిళ్ల: రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్సీ కమిషన్ నియమించి ఉద్యోగులకు మధ్యంతర భృతి ఇవ్వాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులరెడ్డి, స్టేట్ కౌన్సిలర్ భాస్కర్‌రెడ్డి కోరారు. మంగళవారం స్థానిక ఏపీటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఆదివారం సెలవు ఇవ్వకపోవడం వలన మానసిక ఒత్తిడికి గురవుతారన్నారు. సంఘ నాయకులు రమణారెడ్డి, సత్తార్, రామభూపాల్‌రెడ్డి, నరసింహారెడ్డి, నాగసుబ్బారెడ్డి, అన్వర్‌బాష, వెంకటరామిరెడ్డి, రామ్మోహన్‌రెడ్డిపాల్గొన్నారు.

పంటల బీమా చేయించుకోండి



మాట్లాడుతున్న ఏఓ శివశంకర్‌రెడ్డి

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలో రైతులు సాగు చేసిన పంటలకు సంబంధించి పంటల బీమా చేయించుకోవాలని ఏఓ శివశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పెద్దశెట్టిపల్లె గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటకు సంబంధించి ఇ– క్రాప్ బుక్ చేయించుకోవాలని తెలిపారు. తద్వారా పంటల బీమా, ఇతర సౌకర్యాలు లబ్ధి చేకూరుతాయన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం ప్రీమియం చెల్లించేందుకు ఈనెల 30వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. అధిక వర్షం కారణంగా శనగ పంట ఎర్రగా మారిందని, ఎక్కువ శాతం మొక్కలు చనిపోతున్నాయని రైతులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కేవీకే పశువైద్య శాస్త్రవేత్త సురేష్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

కలసపాడు : మార్గశిర మాసం(ధనుర్మాసం)ను పురస్కరించుకుని మంగళవారం మండలంలోని సిద్ధమూర్తిపల్లె, మహానందిపల్లె, కరణం వారిపల్లె గ్రామాల్లో త్రైత సిద్ధాంతం – ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక కంభం కమిటీ సభ్యుల ఆధ్వర్యంతో త్రైత సిద్ధాంత భగవద్గీత గురించి ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత ఆదికర్త శ్రీఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల వారు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేశారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం – ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక కంభం కమిటీ అధ్యక్షుడు నర్రాశ్రీనివాసరెడ్డి, సభ్యులు రామకృష్ణ, బలరామ్, నారాయణ, అంజలి, సరస్వతి, మస్తాన్, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లోక రక్షకుడు ఏతెంచిన వేళ

'విశ్వాసమే ప్రార్థనకు ప్రేరణ.. లోక రక్షకుడి కోసం ఎదురు చూడండి.. ఆయన ఆగమన వేళయ్యింది' అంటూ గంటలు మోగుతుండగా.. చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. చర్చిల్లో ఏసు సందేశాన్ని పాస్టర్లు భక్తులకు అందించారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ప్రారంభమైన వేడుకలు బుధవారం రాత్రి వరకు కొనసాగనున్నాయి.

- నేడు క్రిస్మస్
- క్రీస్తు జన్మదినాన్ని ఘనంగా జరుపుకోనున్న క్రైస్తవులు
- వేడుకలకు ముస్తాబైన చర్చిలు



విద్యుద్దీపాలంకరణలో కలసపాడు ఆర్సీఎం చర్చి



ప్రొద్దుటూరు కల్చరల్ : పశువులపాకలో క్రీస్తు జనన సెట్టింగ్

ప్రొద్దుటూరు కల్చరల్: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పలు చర్చిలు ముస్తాబయ్యాయి. స్థానిక మైదుకూరు రోడ్డులోని ఎస్పీజీ–1, గోకుల్ నగర్‌లోని ఎస్పీజీ–2, దొరసానిపల్లెలోని ఎస్పీజీ–3, బొల్లవరంలోని ఆర్సీఎం, రామేశ్వరి సీఎస్ఐ చర్చి, వైఎంఆర్ కాలనీలోని గోల్డెన్ జూబ్లి తదితర అన్ని చర్చిలను నిర్వాహకులు సుందరంగా ముస్తాబు చేశారు. చర్చిలకు రంగులు వేయడంతో పాటు విద్యుత్ దీపాలతో, అలంకరణ వస్తువులు, శిలువలు, క్రిస్మస్ ట్రీ తదితర సెట్టింగ్‌లతో అలంకరించారు. కొన్ని చర్చిల వద్ద క్రీస్తు జన్మ వృత్తాంతం తెలిపే పశువుల పాకలను ఏర్పాటు చేశారు. మంగళవారం అర్ధరాత్రి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే బుధవారం ఉదయం క్రిస్మస్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధనలు క్రైస్తవులు చేయనున్నారు. చర్చిలు వద్ద, విశ్వాసులు, క్రైస్తవుల ఇంటి వద్ద క్రీస్తు రాక సందర్భంగా స్టార్‌లను ఏర్పాటు చేశారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

స్థానిక గోల్డెన్ పార్క్‌లో మంగళవారం గీతాంజలి హైస్కూల్ విద్యార్థులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. దేవదూత, శాంటాక్లాజ్ వేషధారణలతో అందరిని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శ్రేయారెడ్డి విద్యార్థులకు క్రిస్మస్ పండుగ విశిష్టతను వివరించి, క్రీస్తు ప్రేమ తత్వాన్ని తెలిపారు. కేక్‌కట్ చేసి అందరికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకుడు శివరామిరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు సూర్యకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాజుపాళెంలో..

రాజుపాళెం: మండల కేంద్రమైన రాజుపాళెం ఎస్సీ కాలనీలోని టీసీసీ చర్చి ఆవరణలో మంగళవారం క్రీస్తు పుట్టుకకు గురించి ప్రదర్శించిన నాటకం అందరిని అలరించింది. రెండు రోజులుగా చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా కొవ్వొతుల ప్రదర్శన, నాటకం, కేక్ కటింగ్ వేడుకలను పాస్టర్ సీమా రాణి, పాస్టర్ అనిల్ కుమార్, విశ్వాసులు ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రాత్రి గృహ ప్రార్థన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ముస్తాబైన చర్చిలు

కాశినాయన: క్రిస్మస్ పండుగ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో చర్చిలు ముస్తాబయ్యాయి. విద్యుత్ కాంతులతో చర్చిలను సుందరంగా అలంకరించారు. మంగళవారం అర్ధరాత్రి 12 గంటల నుంచి క్రీస్తు జననం సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు క్రైస్తవులు ముమ్మరంగా ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి నుంచి చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. మండలంలోని అమగంపల్లె చర్చిలో క్రిస్మస్ వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

సర్వలోక రక్షకుడు ఏసు

బద్వేలు అర్బన్: ఏసుక్రీస్తు జననం లోకానికి వెలుగని, యేసు సర్వలోక రక్షకుడని పునీత ఆంతోనివారి దేవాలయం విచారణ గురువులు రెవ. ఫాదర్ గొల్లపల్లెచిన్నప్ప, ఫాతిమామాత చర్చి విచారణ గురువులు రెవ. ఫాదర్ లక్కినేని ఆరోగ్యరాజు పేర్కొన్నారు. క్రిస్మస్ వేడుకలలో భాగంగా మంగళవారం స్థానిక పునీత ఆంతోనివారి దేవాలయం ఆవరణలో, ఫాతిమామాత చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన పశువులపాకలలో బాలయేసును పూజించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో సహాయక గురువులు ఓసూరి జోసెఫ్, రాజేంద్ర, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఐ చర్చిలో..

పట్టణంలోని సుమిత్రానగర్‌లో ఉన్న పరిపాలు పట్టణ దేవాలయం (సీఎస్ఐ చర్చి)లో క్రిస్మస్ సందర్భంగా మంగళవారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తొలుత సంఘస్తుల ఇళ్ల వద్దకు వెళ్లి క్యారల్స్ సర్వీస్ నిర్వహించారు. క్రిస్మస్ కేక్ కట్‌చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ప్రెస్బిటర్ జీవన్‌స్వరాజ్ క్రీస్తు సందేశం అందించారు. అలాగే పట్టణంలోని హోసన్నా, బెతెస్థ, మార్తోమా ప్రార్థనా మందిరం, బ్లెస్సింగ్ చర్చిలలో క్రిస్మస్ ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు.

కలసపాడులో..

కలసపాడు: మండల కేంద్రమైన కలసపాడులోని పరిశుద్ధ పరిపేతురు పరిపాలు చర్చి, ఆర్సీఎం చర్చిలు క్రిస్మస్ పండుగ సందర్భంగా సుందరంగా ముస్తాబయ్యాయి. విద్యుత్‌దీపాలు, రంగురంగు కాగితాలతో చర్చిలను అలంకరించారు. చర్చి ఆవరణలో బాలయేసు, క్రిస్మస్‌ట్రీలను ఏర్పాటు చేశారు. క్రీస్తు జననానికి గుర్తుగా క్రైస్తవులు వారి వారి ఇళ్ల వద్ద స్టార్లను ఏర్పాటు చేసుకున్నారు.

ఊరూరా ముస్తాబైన చర్చిలు

చాపాడు: క్రిస్మస్ పండుగ కోసం ఊరూరా చర్చిలు ముస్తాబు అయ్యాయి. యేసుక్రీస్తు జన్మదినం పురస్కరించుకుని అత్యంత భక్తి భావంతో సంతోషాలతో క్రిస్మస్‌ను జరుపుకుంటారు. ఈ నేపథ్యంలో మండలంలోని చాపాడు, అల్లాడుపల్లె, విజయనగరం, పల్లవోలు, అనంతపురం, రాజుపాలెం, అన్నవరం, చిన్నగురువళూరు, మడూరు, మొర్రాయిపల్లె, బద్రిపల్లె, కేతవరంలో క్రిస్మస్ పండుగను ఘనంగా నిర్వహించనున్నారు. 25న తెల్లవారుజాము నుంచి యేసుక్రీస్తు జన్మదినం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలతో పాటు యేసుక్రీస్తు గొప్పతనాన్ని క్రైస్తవులకు పాస్టర్లు బోధిస్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ వివిధ రకాలైన సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలతో క్రైస్తవులు సంతోషంగా గడుపుతారు.



రాజుపాళెం : క్రీస్తు పుట్టుక నాటకంలోని ఓ సన్నివేశం



బద్వేలు అర్బన్ : ఫాతిమామాత చర్చిలో మరియమాతను సుందరంగా అలంకరించిన నిర్వాహకులు



చాపాడు: విజయనగరంలో విద్యుద్దీపాలంకరణలో చర్చి

పోలీసుల అభ్యంతరం వెనుక మర్మం ఏమిటి?

మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



డీఎస్పీ భక్తవత్సలంతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : కొత్తపల్లె సర్పంచ్ శివచంద్రారెడ్డి శ్మశాన వాటిక అభివృద్ధి పేరుతో చేసిన అవినీతిపై ప్రశ్నించకుండా పోలీసులు అభ్యంతరం చెప్పడం వెనుక మర్మం ఏమిటని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రశ్నించారు. ఆయన మంగళవారం ఉదయం డీఎస్పీ కార్యాలయంలోని డీఎస్పీ భక్తవత్సలంను కలిసి మాట్లాడారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. సర్పంచ్ శివచంద్రారెడ్డి చేసిన అవినీతిని ఆధారాలతో సహా నిరూపించేందుకు మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి సంఘటన స్థలానికి వెళ్లి అక్కడే విలేకరుల సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారన్నారు. అయితే పోలీసులు వైస్ చైర్మన్ ఇంటి వద్దకు వెళ్లి ఉదయాన్నే వైస్ చైర్మన్ సంఘటన స్థలానికి పోవద్దని, విలేకరుల సమావేశం సమావేశం పెట్టవద్దని నోటీసు జారీ చేశారని తెలిపారు. ఆ విషయంపై తాను డీఎస్పీని కలిశానన్నారు. శాంతి భద్రతల కారణంగా వైస్ చైర్మన్‌ను వెళ్లొద్దని చెప్పినట్లు పోలీసులు చెబుతున్నారన్నారు. అవినీతి బండారం బయట పడకుండా టీడీపీ నేతలు ఇలా చేయించారనే అనుమానం వ్యక్తమవుతోందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు తాను మంజూరు చేయించిన కూరగాయల మార్కెట్ నిర్మాణం, బస్టాండ్ నిర్మాణం, పెన్నానది బ్రిడ్జి నిర్మాణాలను పలు మార్లు అప్పుడు మాజీ ఎమ్మెల్యే హోదాలో ఉన్న వరదరాజులరెడ్డి పరిశీలించారని గుర్తుచేశారు. ప్రజా స్వామ్యంలో ఏ పనులను ఎవరైనా పరిశీలించవచ్చునని తెలిపారు. అలాంటిది కొత్తపల్లె పంచాయతీకి పోకుండా అభ్యంతరం చెప్పడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు.

పోలీసు వ్యవస్థపై నమ్మకం ఉంది

శివచంద్రారెడ్డి అవినీతిని ప్రజలందరికి చూపాల్సిన అవసరం ఉందని, దీనిని కూడా బయట పెట్టకుండా తమను బలవంతంగా నిర్బంధించారన్నారు. వరద గతంలో పరిశీలించినప్పుడు తాము అభ్యంతరం వ్యక్తం చేయలేదని, ప్రస్తుతం తాము పరిశీలిస్తుంటే ఎందుకు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇసుక, కంకర, స్టీల్ నాణ్యత గురించి అప్పట్లో వరదరాజులరెడ్డి ఆరా తీశారన్నారు. శ్మశాన వాటికకు సంబంధించిన రూ.40లక్షల అభివృద్ధి పనులపై తాము ఎందుకు ప్రశ్నించకూడదని నిలదీశారు. పోలీసు వ్యవస్థపై తనకు సంపూర్ణ నమ్మకం ఉందని తెలిపారు. శాంతి భద్రతల పర్యవేక్షణకు సంబంధించి ఆంక్షలు పెట్టడం జరిగిందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ జేష్టాది శారద, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ ఆయిల్ మిల్లు ఖాజా, వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు వల్లూరు నాగేంద్రారెడ్డి, ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, కౌన్సిలర్లు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, ముదిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, ద్వార్శల భారతి, గుర్రం లావణ్య, గరిశపాటి లక్ష్మీదేవి పాల్గొన్నారు.

నాలుగు టిప్పర్లు మట్టి తోలి రూ.40 లక్షలు డ్రా చేశారు

మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి



శ్మశాన వాటికను అభివృద్ధి చేయలేదని ఫొటోలు చూపిస్తున్న పాతకోట బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు : కొత్తపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని సుందరయ్యనగర్‌లో ఉన్న శ్మశాన వాటిక లెవలింగ్ పనులకు సంబంధించి సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి నాలుగు టిప్పర్లు మట్టి తోలి రూ.40లక్షలు బిల్లులు డ్రా చేశారని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి ఆరోపించారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొత్తపల్లె సర్పంచ్‌కు సంబంధించిన అవినీతి భాగోతం ఇది మొదటి ఎపిసోడ్ మాత్రమే అన్నారు. పంచాయతీ పరిధిలోని ఖాదరబాద్, జేమ్స్‌పేట ప్రజల కోసం సుందరయ్య నగర్‌లో 1.37 ఎకరాల విస్తీర్ణంలో శ్మశాన వాటికను ఏర్పాటు చేశారన్నారు. 20 ఏళ్ల క్రితం శ్మశాన వాటికకు ప్రహరీని నిర్మించడం జరిగిందన్నారు. వరదరాజులరెడ్డి ఎమ్మెల్యే అయ్యాక శ్మశాన వాటిక అభివృద్ధి పనులు మంజూరు చేయించుకున్నారని తెలిపారు. వరదరాజులరెడ్డి స్వగ్రామం అయిన కుందూనది ఇసుకను టిప్పర్ రూ.1,000 కొని సర్పంచ్ టిప్పర్‌కు రూ.4లక్షల చొప్పున రూ.40లక్షలు వసూలు చేశారని ఆరోపించారు. రూ.40,29,925 పంచాయతీ జనరల్ ఫండ్ నుంచి బిల్లు డ్రా చేసినట్లు తెలిపారు. బయటికి కనిపించకుండా ఒక మారు రూ.18,67,064, రెండో మారు 11,97,010, మూడో మారు రూ.3,84,695, నాలుగోమారు రూ.5,37,653 డ్రా చేసుకున్నారని పేర్కొన్నారు.

విచారణ జరిపించాలి

ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తమ ప్రభుత్వ హయాంలో జరిగిన పనులపై విజిలెన్స్ విచారణ చేయిస్తున్నారని బంగారు మునిరెడ్డి తెలిపారు. ఆయనకు చిత్తశుద్ధి ఉంటే కొత్తపల్లె పంచాయతీలో జరిగిన అభివృద్ధి పనులపై కూడా విచారణ చేయించాలని కోరారు. ప్రజలు కట్టే పన్నుల నుంచి పంచాయతీకి జనరల్ ఫండ్ వస్తుందని, ఆ ఫండ్‌నే ఇలా స్వాహా చేస్తే ఎలా అని ప్రశ్నించారు. తాను శ్మశాన వాటిక స్థలంలోనే విలేకరుల సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నానని, పోలీసులు అక్కడికి వెళ్లకూడదని తన ఇంటి వద్దకు వచ్చి నోటీసు జారీ చేశారని చెప్పారు. ఎవరైనా శ్మశాన వాటిక వద్దకు వెళ్లి విచారణ చేయించుకోవచ్చన్నారు. సమావేశంలో ఎంపీటీసీ పేరం సునీత, వార్డు మెంబర్ లక్ష్మీనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జంగమయ్య, గంగాధర్ పాల్గొన్నారు.

ఓబుల్‌రెడ్డి మృతికి సంతాపం



ఓబుల్‌రెడ్డి మృతదేహానికి నివాళి అర్పిస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి, కుటుంబసభ్యులు



ఓబుల్‌రెడ్డి మృతదేహానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, నాయకులు

బ్రహ్మంగారిమఠం: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, అల్లుడు సన్ రైజ్ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ ఎండీ డాక్టర్ అంకిరెడ్డిపల్లె విజయభాస్కర్ రెడ్డి, తండ్రి ఎ. ఓబుల్ రెడ్డి (85) అనారోగ్యంతో మృతి చెందాడు. మంగళవారం చౌదరవారిపల్లెలో ఓబుల్‌రెడ్డి మృతదేహానికి పి. రవీంద్రనాథ్‌రెడ్డి, ఆయన సతీమణి అరుణ కుమారి, కుటుంబసభ్యులు నివాళి అర్పించారు. అంతకుముందు ఓబుల్‌రెడ్డి మృతదేహానికి మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, జెడ్పీటీసీ ముత్యాల రామగోవిందరెడ్డి, ఎంపీపీ చీలేకాంపల్లె వీరనారాయణరెడ్డి, సింగల్‌విండో అధ్యక్షుడు బొగ్గల సుబ్బిరెడ్డి, జౌకుపల్లె దుగ్గిరెడ్డి, స్థానిక నాయకులు చంద్ర ఓబుల్‌రెడ్డి, లెక్కల నారాయణరెడ్డి పూలమాలవేసి నివాళి అర్పించి, కుటుంబసభ్యులను ఓదార్చారు.

రేషన్ డీలర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం


బద్వేలు అర్బన్ : బద్వేలు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న 155 చౌకదుకాణ డీలర్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్డీఓ ఎ.చంద్రమోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులకు సంబంధించి మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేశామని, దరఖాస్తులను వచ్చే ఏడాది జనవరి 6వ తేదీ లోపల సంబంధిత తహసీల్దారు కార్యాలయంలో అందజేసి తగిన రసీదు పొందాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు వచ్చే ఏడాది జనవరి 27న అర్హత పరీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నోటిఫికేషన్‌ను సంబంధిత తహసీల్దారు కార్యాలయాలు, మండల పరిషత్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయం, సచివాలయాలు, చౌకదుకాణాల వద్ద ప్రచురించవలసిందిగా కోరారు. పరీక్షా కేంద్రాలను త్వరలో వెల్లడిస్తామని తెలిపారు.

గ్రేస్ చిల్డ్రన్స్ మినిస్ట్రీస్ సేవలు అభినందనీయం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పట్టణంలోని గ్రేస్ చిల్డ్రన్స్ మినిస్ట్రీస్ వారు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని శాప్ మాజీ డైరెక్టర్, ఫుడ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఇండియన్ క్రిస్టియన్ ఫోరం స్టేట్ వైస్ ప్రెసిడెంట్ మూరతాటి డేనియల్ ప్రదీప్ తెలిపారు. క్రిస్మస్ సందర్భాన్ని పురస్కరించుకుని గ్రేస్ చిల్డ్రన్స్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో మంగళవారం 300 మంది పేదలకు దుప్పట్లతో పాటు ఆహార పొట్లాలు అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గత 33 ఏళ్లుగా ప్రతి ఏడాది క్రిస్మస్ సందర్భంగా ఈ సేవలు అందిస్తున్నారన్నారు. అనాథలకు, పేదలకు పండుగ సందర్భంగా సాయం అందించడం గొప్ప విషయమన్నారు. ఉన్న వారు లేని వారికి దానం చేయాలని సూచించారు. గ్రేస్ చిల్డ్రన్స్ మినిస్ట్రీస్ అధ్యక్ష, కార్యదర్శులు విజయ, ఆల్బర్ట్, లవింగ్ షపర్డ్ లివింగ్ చర్చి పాస్టర్ ఎల్‌డీఎస్ సుమిత్ర, జ్యోతి గడ్డం సురేష్ పాల్గొన్నారు.

హామీలు విస్మరించడం చంద్రబాబు నైజం

- ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల: ఎన్నికల ముందు హామీలు ఇచ్చి విస్మరించడం చంద్రబాబు నైజమని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి మండిపడ్డారు. కరెంట్ చార్జీల భారంపై మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ, పార్టీ నాయకులతో కలసి పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ నెల 27న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జరిగే ఆందోళన జయప్రదం చేయాలని పిలుపిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు నాయుడు కరెంటు చార్జీలు పెంచనని అవసరమైతే చార్జీలు తగ్గిస్తానని బూటకపు హామీలు గుప్పించారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలలు తిరక్కుండానే రూ. 15,485 కోట్ల భారాన్ని కూటమి ప్రభుత్వం ప్రజలపై మోపిందన్నారు. పెరిగిన విద్యుత్ చార్జీలతో అందరూ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సూపర్ సిక్స్‌హామీలు గాలికి వదిలేశారని మండిపడ్డారు. చార్జీల పెంపు ఉపసంహరించుకునే వరకు వైఎస్సార్‌సీపీ పోరాటం కొనసాగిస్తుందని ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అందించాలని గోవిందరెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు సిఎం బాషా, రాజశేఖర్, సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, ఎంపీటీసీ ఇస్సాక్, ఉపసర్పంచ్ రవిచంద్రారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రాళ్లపల్లె నరసింహులు, నాయకులు నారాయణరెడ్డి, గంగయ్య, సాయినారాయణరెడ్డి పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే రాచమల్లు



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్: శ్రీచౌడేశ్వరి ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తన స్వగృహంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన నూతన సంవత్సరం అందరికి శుభాలు తేవాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శ్రీచౌడేశ్వరి ఆర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంభం పాములేటి, జెడ్పీ చైర్‌పర్సన్ జేష్టాది శారద, మున్సిపల్ చైర్మన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఎంపీపీ శేఖర్ యాదవ్, మున్సిపల్ కౌన్సిలర్‌లు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

వైభవంగా ఈశ్వరీదేవి ఆరాధన



ఈశ్వరీదేవి అమ్మవారి గ్రామోత్సవాన్ని ప్రారంభిస్తున్న భక్తులు

బద్వేలుఅర్బన్ : స్థానిక మైదుకూరు రోడ్డులోని శ్రీఈశ్వరీదేవి ఆశ్రమంలో మంగళవారం జగన్మాత శ్రీఈశ్వరీదేవి ఆరాధన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీఈశ్వరీదేవి సజీవ యోగ సమాధి నిష్ఠ వహించిన పవిత్రదినమును పురస్కరించుకుని చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా తెల్లవారుజాము నుంచే ఈశ్వరీదేవి సుప్రభాతం, సూక్త పారాయణం, పంచామృతాభిషేకం, సహస్రనామ, కుంకుమార్చన నిర్వహించి అనంతరం శ్రీచక్ర నవవర్ణ కుంకుమార్చన, నవగ్రహ, చండీ శాంతి హోమము తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేయడంతో పాటు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకులు గోవిందిన్నెసుబ్బరాయుడుస్వామి, సభ్యులు సి.వి.నాగేశ్వరరావు, రాజేష్‌కుమార్, చిన్నబ్రహ్మయ్య, భక్త బృందం పాల్గొన్నారు.

మానవసేవే మాధవసేవ

పోరుమామిళ్ల: మానవసేవయే మాధవసేవ అని పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణరెడ్డి అన్నారు. వివేకానంద సేవాశ్రమం గురించిన సమాచారంపై ముద్రించిన కరపత్రాలను మంగళవారం పట్టణంలోని పెన్షనర్స్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకొని పాపిజెన్ని రామకృష్ణారెడ్డి వివేకానంద ఫౌండేషన్ స్థాపించి సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. రామకృష్ణారెడ్డి నేటి యువతకు ఆదర్శప్రాయుడని కొనియాడారు. ఆశ్రమానికి సహకరించాలని, సహాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు గురుమూర్తి, అమీర్, చెన్నయ్య, సుబ్రమణ్యం, సుబ్బిరెడ్డి, గౌస్‌పీర్ పాల్గొన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి

బద్వేలు అర్బన్: అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర మంత్రి అమిత్ షా వెంటనే పార్టీకి, పదవికి రాజీనామా చేయాలని బహుజన సమాజ్‌పార్టీ జిల్లా ఇన్‌చార్జి సగిలిగురప్ప, జిల్లా అధ్యక్షుడు డి.ఎస్.జయరామ్ పేర్కొన్నారు. రాజ్యాంగ వజ్రోత్సవాలలో భాగంగా రాజ్యసభలో అంబేడ్కర్‌ను ఉద్దేశించి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం బీఎస్పీ ఆధ్వర్యంలో దళిత ప్రజా సంఘాలను కలుపుకుని నెల్లూరురోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశభక్తి, దైవభక్తికి మధ్య తేడా తెలియని అమిత్‌షా లాంటి వ్యక్తి దేశ శాంతిభద్రతలను పరిరక్షించే కేంద్ర హోంమంత్రిగా ఉండటానికి అనర్హుడని అన్నారు. బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు గౌస్‌పీర్, జిల్లా ఉపాధ్యక్షుడు బాలచంద్ర, మహిళా ఉపాధ్యక్షురాలు బేబీ, ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా పాల్గొన్నారు.